సీసీటీఎన్ఎస్ రైటర్లకు ఒక రోజు శిక్షణ

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

- ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి

మెదక్ అర్బన్, నవంబర్ 23: జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సీసీటీఎన్ఎస్ రైటర్లకు ఆప్లికేషన్‌కి సంబంధించిన సిబ్బందికి ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఈఐఆర్‌పై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ఈ అప్లికేషన్ ముఖ్యంగా మొబైల్ ఫోన్ పోయినప్పుడు దాన్ని పట్టుకోవాడానికి చాలా ఉపయోగపుడుతుందన్నారు. ప్రస్తుత జీవిన శైలిలో మొబైల్ ఫోన్ అత్యంత కీలక పరికరం అయ్యిందని తెలిపారు. ఇంతటి ప్రాధాన్యం సంతరించుకున్న ఎక్కడైనా పోగొట్టుకున్న లైదా చోరీకి గురైతే పరిస్థితి సీఈఐఆర్ అప్లికేషన్ ద్వారా చరవాణి ఎక్కడైనా పోగొట్టుకున్న, చోరీకి గురైనా చరవాణిలను వెతికి పట్టుకోవడానికి ఎంతో చేయూతనిస్తుందని, జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా పోగొట్టుకున్న లేదా చోరీకి గురైనా వాటిని ఈ అప్లికేషన్ ద్వారా మొత్తం పట్టుకుని బాధితులకు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు.

అయ్యప్ప పడి పూజలో జిల్లా న్యాయమూర్తి

చిన్నశంకరంపేట, నవంబర్ 23: చిన్నశంకరంపేటలో ప్రముఖ హైకోర్టు న్యాయవాది జనార్దన్‌రెడ్డి శనివారం నిర్వహించిన అయ్యప్ప మహాపడి పూజలో జిల్లా న్యాయమూర్తి లక్ష్మీశారద పాల్గొన్నారు. మెదక్, రామాయంపేట, చేగుంట, తూప్రాన్, నార్సింగి మండలాల నుంచి అయ్యప్ప మాలధారులు పూజలు చేశారు. లీగల్‌సెల్ కార్యదర్శి జితేందర్, జూనియర్ సివిల్ నాయమూర్తి సిరి సౌజన్య పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

రామాయంపేటలో..

రామాయంపేట, నవంబర్ 23: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో హోమాలు చేశారు. అయ్యప్ప మాలధారులు ఆలయంలో స్వామికి అభిషేకాలు, హోమా లు, మంగళ హారతులు, నైవేద్యాలను సమర్పించారు.

చిన్నారిపై వీధి కుక్కల దాడి

వీధి కుక్కల దాడిలో గాయపడ్డ చిన్నారి

చిన్నశంకరంపేట, నవంబర్ 23: పట్టణంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధి కుక్కల దాడిలో ఓ చిన్నారికి తీవ్ర గాయాలైన ఘటన చిన్నశంకరంపేటలో శనివారం జరిగింది. పట్టణంలో నివసిస్తున్న సంతోష దీపు మహిళ స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో పని చేస్తున్నది. పరిశ్రమకు వెళ్లే క్రమంలో ఇంటికి తాళం వేస్తుండగా ఆమె కుమారుడు చంద్రప్రకాశ్ ఇంటి ఆవరణలో ఆడుకుంటున్నాడు. ఇదే సమయంలో వీధి కుక్క దాడి చేసి మూడేళ్ల చిన్నారిని తీవ్రంగా గాయపరిచింది. ఆ చిన్నారి చేతికి, కాలికి గాయం కాగా ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందించారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

నర్సింహులు (ఫైల్)

చేగుంట, నవంబర్ 23: విద్యుత్ షాక్ తగిలి వ్యక్తి మృతి చెందాడు. మరో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన చేగుంటలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని అనంతసాగర్ గ్రామానికి చెందిన మెండే నర్సింహులు (41) చేగుంటలోని ఓ కట్టెల మిషన్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. శనివారం ఉదయం సా మిల్ యజమాని గర్ధాస్ రామారావుతో కలిసి పనిచేస్తున్నాడు. ఈ సమయంలో మిషన్‌కు విద్యుత్ సరఫరా కావడంతో ఇరువురు షాక్‌కు గురైయ్యారు. తీవ్ర గాయాలైన వారిని దవాఖానకు తరలిస్తుండగా, మధ్యలో నర్సింహులు మృతి చెందాడు. తీవ్ర గాయాలైన రామారావుకు చికిత్స అందిస్తున్నారు. నర్సింహులు మృత దేహానికి పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తునట్లు చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు.

ట్రాక్టర్ తగిలి వృద్ధురాలి మృతి

మొట్టు లక్ష్మి (ఫైల్)

చేగుంట, నవంబర్ 23: ట్రాక్టర్ తగిలి వృద్ధురాలు మృతి చెందిన ఘటన చేగుంట మండలం గొల్లపల్లి గ్రామంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వృద్ధురాలు మొట్టు లక్ష్మి గ్రామంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్నది. మొట్టు జానేశ్ ట్రాక్టర్‌ను రోడ్డుపై అజాగ్రత్తగా వెనుకకు రివర్స్‌లో నడిపాడు. దీంతో లక్ష్మికి ట్రాక్టర్ తగిలి తీవ్ర గాయాలయ్యాయి. దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి మనుమడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు ఎస్ఐ చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు

వ్యాయామంతో మధుమేహం దూరం

చేగుంటలో మధుమేహంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అనంతరెడ్డి

చేగుంట, నవంబర్ 23: వ్యాయామం చేస్తే మధుమేహం దూరమవుతుందని లయన్స్ డాక్టర్ అనంతరెడ్డి తెలిపారు. చేగుంట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చేగుంట జడ్పీహెచ్ఎస్‌లో శనివారం మధుమేహం రాకుండా నివారణ కోసం వ్యాయామ పద్ధతులు, ఆహారపు ఆలవాట్లపై అవగాహన కల్పించి, కరపత్రాలను విడుదల చేశారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి రజనక్ రాంచంద్రం, న్యాలపల్లి సతీష్, గర్ధాస్ మనోహర్‌రావు, వరగంటి నాగరాజు, సూర్యప్రకాశ్, నాగరాజు, శంబుని శ్రీనివాస్, ఇన్‌చార్జి హెచ్ఎం రఘుపతి, రావుల వెంకటేశ్, సుధాకర్‌రెడ్డి, రాధ, రేఖ, పీడీ వసుంధర ఉన్నారు.

నిజాంపేటకు మాల మహానాడు పాదయాత్ర

నిజాంపేట, నవంబర్ 23: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆధ్వర్యంలో చేపట్టిన మాల మహానాడు పాదయాత్ర శనివారం నిజాంపేటకు చేరుకున్నది. మాల మహానాడు మండల గౌరవ అధ్యక్షుడు, అధ్యక్షుడు రాజయ్య, చంద్రయ్య ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు ర్యాకం శ్రీరాములు, సభ్యులు రాగుల బాబు, లక్ష్మణ్, కాపర్ల ప్రేమనందం ఉన్నారు.

కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు ఎదగాలి

చిన్నశంకరంపేట, నవంబర్ 23: విద్యార్థులు కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని రంగంపేట సతీశ్‌గౌడ్, శ్రీనివాస్ గౌడ్ సూచించారు. శనివారం మండలంలోని చందంపేట జడ్పీహెచ్ఎస్‌లో ఆరు, ఏడు తరగతుల విద్యార్థులకు బ్యాగులు, నోట్‌బుక్స్, జామెట్రీ మెటీరియల్, బాలశిక్ష అందజేశారు. బాగా చదుకుని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని వారు సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులు కలిగించొద్దు

అల్లాదుర్గం: సీతానగర్ కొనుగోలు కేంద్రం వద్ద రైతుల సమస్యలు తెలుసుకుంటున్న డీఎం హరికృష్ణ

వెల్దుర్తిలోని రాఘవేంద్ర రైస్‌మిల్లులో ధాన్యం అన్‌లోడింగ్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణ

- పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హరికృష్ణ

అల్లాదుర్గం, నవంబర్ 23: ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలిగించొద్దని పౌర సరఫరాల జిల్లా మేనేజర్ హరికృష్ణ నిర్వాహకులు, రైస్‌మిల్లర్లు, అధికారులకు ఆదేశించారు. మండలంలోని సీతానగర్ కొనుగోలు కేంద్రంలో తరుగు పేరిట రైస్ మిల్లర్లు, అధికారులు రైతులను దోపిడీ చేస్తున్నారంటూ శుక్రవారం హైదరాబాద్-నాందేడ్ జాతీయ రహదారిపై రైతులు ఆందోళన చేశారు. ఈ విషయం తెలుసుకున్న డీఎం శనివారం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. కొనుగోలులో నెలకొన్న సమస్యలను రైతులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధాన్యం కొనుగోలులో మిల్లర్లు ఎలాంటి కొర్రీలు పెట్టవద్దని మిల్లర్లకు సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారమే ధాన్యం కొనుగోలు చేస్తుందని, కొనుగోలులో ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కొనుగోలు మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. డీఎం వెంట ఆర్ఐ శరణప్ప, ఏఈవో నవీన్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేషారెడ్డి, జైపాల్, హన్మయ్య, సాయిలు తదితరులు ఉన్నారు.

వేగంగా ధాన్యం అన్‌లోడ్ చేయాలి

వెల్దుర్తి, నవంబర్ 23: కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని రైస్‌మిల్లుల యజమానులు త్వరగా అన్‌లోడ్ చేయాలని తహసీల్దార్ కృష్ణ ఆదేశించారు. శనివారం వెల్దుర్తిలోని రాఘవేంద్ర రైస్‌మిల్‌ను ఆర్ఐ జయభరత్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా తూకం వేసిన ధాన్యాన్ని రైస్‌మిల్లులకు తరలించాలన్నారు. ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలించారు. 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఈవో బలరాంరెడ్డి, బీఎల్‌వోలు ఉన్నారు.

విజయం కోసం కష్టపడాలి: ఆర్జేడీ

విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్జేడీ సత్యనారాయణ రెడ్డి

అల్లాదుర్గం,నవంబర్ 23: విజయం సాధించాలంటే ప్రతిఒక్కరూ కష్టపడాలని రీజినల్ జాయింట్ డైరెక్టర్ వరంగల్ (ఆర్జేడీ) అన్నారు. శనివారం మండలంలోని ముస్లాపూర్ జడ్పీహెచ్ఎస్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఎల్ఐపీ, ఎన్ఏఎస్, ఎమ్‌డీఎమ్ తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పలు విషయాలపై ప్రశ్నలు అడిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిపరీక్షలను నిర్భయంగా రాయాలన్నారు. విద్యార్థి దశలో కష్టంగా కాకుండా ఇష్టంగా చదవడం అలవర్చుకోవాలన్నారు. ఉన్నత శిఖరాలకు ఎదిగి గురువులు, తల్లిదండ్రుల పేర్లు నిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ధనుంజయ, హెచ్ఎమ్ రమేశ్, టీచర్లు జనార్దన్, అంజనేయులు, శ్రీకాంత్, రాజరత్నం, రుక్మిణి, క్రాంతి కుమారి, సంతోష్, దుర్గయ్య, యాదయ్య తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబీకులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

పెద్దశంకరంపేట: సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పెద్దశంకరంపేట, నవంబర్ 23: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి శనివారం అందజేశారు. మండలంలోని జూకల్‌కు చెందిన అనసూయకు రూ.33 వేలు, రామోజిపల్లికి చెందిన చిరంజీవికి రూ.25 వేలు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. అనంతరం మూసాపేట గ్రామానికి చెందిన అడివయ్యకు పరామర్శించారు. ఆయనతో మాజీ ఎంపీపీ జంగం శ్రీనివాస్, నాయకులు సురేశ్‌గౌడ్, దత్తు, వెంకట్‌రెడ్డి, యాదూల్, యాకూబ్, తదితరులున్నారు.

అల్లాదుర్గంలో..

అల్లాదుర్గం, నవంబర్ 23: మండలంలోని బహిరన్‌దిబ్బ గ్రామానికి చెందిన లేకి కవితకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేషారెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రభు, బస్వరాజ్, అశోక్, శ్రీకాంత్, తోక శ్రీకాంత్ పాల్గొన్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

చిన్నశంకరంపేట, నవంబర్ 23: విద్యార్థులు నాణ్యమైన విద్యను అందించడానికి అధ్యాపకులు కృషి చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి మాధవి సూచించారు. శనివారం చిన్నశంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు రాస్తున్న అర్ధవార్షిక పరీక్షలను ఆమె పరిశీలించారు. విద్యార్థులకు చదువుతో పాటు వారిలో దాగి ఉన్న నైపుణ్యకళను వెలికితీసి శిక్షణను అందించాలన్నారు. కళాశాలకు రాని విద్యార్థులను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. వార్షిక పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ప్రిన్సిపాల్ శశిధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థుల వైజ్ఞానిక ప్రదర్శన

మానవ శరీరంలోని అవయవాల గురించి వివరిస్తున్న విద్యార్థులు

చిన్నశంకరంపేట,నవంబర్23ః చిన్నశంకరంపేట జడ్పీ పాఠశాలలో శనివారం అగస్త్య అంతర్జాతీయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులు వైజ్ఞానిక ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మానవ శరీరంలోని అవయవాల వివిధ వ్యవస్థల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్, వెంకటేశం, దిగంబర్, హెచ్ఎం దీప్లారాథోడ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ధనుర్మాస కరపత్రం ఆవిష్కరణ

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 23: డిసెంబర్ 16 నుంచి ధనుర్మాసం ప్రారంభం కానున్న సందర్భంగా శనివారం వేంకటేశ్వర దేవాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ మధుసూదన్ మాట్లాడుతూ జనవరి 14 వరకు ధనుర్మాస మహోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

గాలికుంటు వ్యాధి టీకాలు వేయించాలి

రామాయంపేట, నవంబర్ 23: పశువులకు గాలికుంటు, గర్భ నిర్ధారణ టీకాలను వేయించాలని అసిస్టెంటు పశువైద్యుడు రాజు పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని పశువైద్యశాలలో ఈ శిబిరం ఏర్పాటు చేసి టీకాలు వేశారు.

సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

ఎంపీడీవో కార్యాలయంలో సర్వేను పరిశీలిస్తున్న ఆర్డీవో రమాదేవి

రామాయంపేట, నవంబర్ 23: సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి పేర్కొన్నారు. శనివారం రామాయంపేట పురపాలిక, ఎంపీడీవో కార్యాలయాల్లో ఎన్యూమరేటర్లను వివరాలు అడిగి తెలుసుకుని ఆన్‌లైన్‌ను పరిశీలించారు. పూర్తి వివరాలను తెలుసుకుని డాటాను కంప్యూటర్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రజినీకుమారి, ఎంపీడీవో షాజులుద్దీన్, పురపాలిక కమీషనర్ దేవేందర్, మేనేజర్ శ్రీనివాస్, శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

రామాయంపేట విద్యుత్ ఏఈగా తిరుపతిరెడ్డి

రామాయంపేట, నవంబర్ 23: రామాయంపేట విద్యుత్ శాఖ ఏఈగా తిరుపతి రెడ్డి శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. మెదక్ రూరల్ ఏఈగా ఉన్న తిరుపతి రెడ్డి బదిలీపై రామాయంపేటకు వచ్చారు. గతంలో రామాయంపేటలో విధులు నిర్వహించిన పెంట్యానాయక్ వెల్దుర్తి మండలానికి వెళ్లారు.

పాఠశాలలో అన్నదానం

నిజాంపేట, నవంబర్ 23: నిజాంపేటలోని ఉన్నత పాఠశాలలో 9 వ తరగతి చదువుతున్న విద్యార్థిని సాయిప్రియ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించి ఇటీవల మృతి చెందింది. శనివారం సాయిప్రియ జయంతి సందర్భంగా ఆమె జ్ఞాపకార్థం విద్యార్థులకు బాధిత కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం జ్ఞాలమాల, ఉపాధ్యా యులు, విద్యార్థులు ఉన్నారు.

జిల్లాకు ఇందిరమ్మ ఇండ్ల సర్వే పైలెట్ ప్రాజెక్టు

లింగసాన్‌పల్లిలో ఇందిరమ్మ ఇండ్ల యాప్ ద్వారా సర్వే తీరును పరిశీలిస్తున్న కలెక్టర్

మెదక్‌రూరల్ నవంబర్ 23: ఇందిరమ్మ ఇండ్ల సర్వే ప్రాజెక్టు కింద జిల్లాకు చోటు కల్పించినట్లు కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. శనివారం హవేళీఘనపూర్ మండలం లింగసాన్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల సర్వే తీరును కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాకు చోటు దక్కడం అభినందనీయమన్నారు. లింగసాన్‌పల్లి గ్రామం, మెదక్ మున్సిపాలిటీలో వార్డ్ నెం-5 ఇందిరమ్మ ఇండ్ల సర్వే నిర్వహిస్తునట్లు చెప్పారు. సర్వే వేగం పెంచాలని, తెలంగాణలో సొంత జాగా ఉండి, ఇండ్లు లేని పేదలకు తొలిదశలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయత్‌రాజ్ ఈఈ నర్సింలు, ఈడీఎం సందీప్, హవేళీఘనపూర్ ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి సంధ్య, తదితరులు ఉన్నారు.

రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు ప్రారంభం

మాసాయిపేటలో రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న నాయకులు

వెల్దుర్తి, నవంబర్ 23: మాసాయిపేటలో అంతర్ జిల్లాల సబ్ జూనియర్ బాలుర రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంయుక్త కార్యదర్శి శోభన్‌బాబు, ఎంఈవో లీలావతి పోటీలను ప్రారంభించారు. వివిధ జిల్లాలకు చెందిన 20 జట్లు పాల్గొంటున్నాయని, క్రీడాకారులు మెరుగైన ప్రదర్శన చేసి జాతీయ జట్టుకు ప్రాతినిధ్యం వహించి పతకాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు అభిషేక్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నవీన్, మాజీ సర్పంచ్ మధుసూదన్‌గౌడ్, మాజీ ఎంపీటీసీ సిద్దిరాములు గౌడ్, పలువురు పాల్గొన్నారు.

డీసీసీబీ ద్వారా డిపాజిట్ పథకం ప్రారంభం

మహిళా సంఘాలకు అవగాహన కల్పిస్తున్న డీసీసీబీ మేనేజర్

రామాయంపేట, నవంబర్ 23: మహిళా సంఘాల సభ్యులు డీసీసీబీలో డిపాజిట్లు చేసుకోవాలని మేనేజర్ వేణుగోపాల్ తెలిపారు. శనివారం ఆర్.వెంకటాపూర్, డి.ధర్మారం గ్రామాల్లో పర్యటించి డ్వాక్రా, మహిళా సంఘాలకు డిపాజిట్లపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంటు మేనేజర్ మిట్టపల్లి రాజు, అక్షరాస్యత కౌన్సెలర్ మహేందర్, సీఈవో పుట్టి నర్సింహులు ఉన్నారు.

అంగన్‌వాడీ చిన్నారులకు కుర్చీలు అందజేత

చిన్నారులకు కుర్చీలు అందజేసిన మాజీ ఎంఎసీ చైర్మన్ రజనక్ ప్రవీణ్‌కుమార్

చేగుంట, నవంబర్ 23: అంగన్‌వాడీ చిన్నారులకు మాజీ ఎంఎసీ చైర్మన్ ప్రవీణ్‌కుమార్ కుర్చీలు అందజేశారు. మండలంలోని వడియారంలో నాలుగు అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుకుంటున్న 84మంది చిన్నారులకు శనివారం కుర్చీలు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ చేగుంట కార్యదర్శి రామచంద్రం, ఆకుల మల్లేశం, రమాదేవి, రాణి, శ్రవంతి, రేణుక, ఆయాలు, చిన్నారులు తదితరులున్నారు.

వామ్మో చలి

-చలికి తట్టుకోలేక వణుకున్న జనాలు

చలి గాలులకు తాళలేక దుప్పటి కప్పుకున్న మహిళ

రామాయంపేట, నవంబర్ 23: ఉష్ణోగ్రతలు తగ్గడంతో రోజురోజుకూ చలి పెరుగుతున్నది. తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు చలితో ప్రజలు అల్లాడుతున్నారు. ఈ చలి తీవ్రతతో సాయంకాలం ఐదు గంటలకే ఇంటి ముఖం పడుతున్నారు. బయటకు వస్తే చలితో సీజనల్ వ్యాధులు దగ్గు, జలుబు, జ్వరం వచ్చే అవకాశం ఉన్నందున్న భయాందోళనలు చెందుతున్నారు. రాత్రి వేళల్లో పల్లె ప్రాంతాల్లో చలికి తట్టుకోలేక ఇండ్ల వద్ద మంట కాచుకుంటున్నారు. మహిళలు, వృద్ధులు, చిన్నారులు దుప్పట్లు కప్పుకుని ఇండ్లలోనే ఉంటున్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం

వెల్దుర్తి, నవంబర్ 23: రోజూ యోగా సాధన చేయడంతో మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవడం, సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని జగిత్యాలకు చెందిన శ్రీకృష్ణ అష్టాంగ యోగా సంస్థ గురూజీ కోటి కళింగరాజు అన్నారు. వెల్దుర్తిలో వారం రోజుల నుంచి యోగా శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నారు. యోగా సానాలు, వాటి ప్రయోజనాలు, మానసిక ఒత్తిడిని జయించడం, శారీరకంగా మానసికంగా ధృడంగా మారడం, దైవ, దేశ భక్తి, మానవ జీవితంపై అవగాహన కల్పించారు. యాంత్రిక జీవనంలో అనారోగ్యాలకు గురై జీవితాలు నాశనం చేసుకుంటున్నారన్నారు. దీన్ని అధిగమించడానికి యోగా ఉపయోగపడుతుందని, నిత్యం సాధన చేయడంతో ఒత్తిడిని జయించవచ్చన్నారు.

దర్జాగా మట్టి అక్రమ తవ్వకాలు

- అటవీ భూమిలోనూ అక్రమంగా మట్టి తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు
- జేబులు నింపుకొంటున్న బడాబాబులు

అటవీ భూమిలో నుంచి మట్టిని తరలించడంతో ఏర్పడిన బారీ గుంతలు

మట్టిని తవ్వడానికి స్థలంలో ఉపయోగించిన జేసీబీ

మట్టి తవ్వడంతో ఏర్పడిన గుంతలు

నర్సాపూర్, నవంబర్ 23: మండలంలోని పెద్దచింతకుంట గ్రామ శివారులోని దోసలగుట్ట అసైన్డ్ భూమిలోంచి మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. నర్సాపూర్ నుంచి మెదక్ వైపు వెళ్లే మార్గంలో ప్రధాన రహదారిని అనుకుని ఉన్న ఈ భూమిలోంచి జేసీబీ, టిప్పర్ల సహాయంతో యథేచ్ఛగా మట్టిని తరలిస్తున్నారు. అసైన్‌మెంట్ భూమిని ఆనుకొని ఉన్న అటవి భూమిలో సైతం తవ్వకాలు చేపట్టి మట్టిని తరలిస్తున్నారు. ఈ తతంగం కొన్ని నెలల నుంచి జరుగుతున్నా అధికారులు అటువైపు కన్నెత్తిచూడడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి అక్రమ రవాణాను అడ్డుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంలో తహసీల్దార్ శ్రీనివాస్‌ను వివరణ కోరగా మట్టిని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఘటనా స్థలానికి వెళ్లామని, అంతలోపే జేసీబీ, టిప్పర్లను అక్కడి నుంచి తప్పించారని అన్నారు. భూమిలో నుంచి మట్టిని పెద్ద మొత్తంలో తవ్వడాన్ని గుర్తించామన్నారు. ఆ భూమి అసైన్డ్ ల్యాండా కాదా అని విచారిస్తామని తెలిపారు. అక్కడున్న ఓ వ్యక్తిని అడిగితే అది అసైన్డ్ ల్యాండ్ అని చెప్పాడన్నారు. అనుమతులు లేకుండా అసైన్డ్ ల్యాండ్‌లో నుంచి మట్టిని తరలించడం చట్టవిరుద్ధమేనన్నారు.